క్లుప్తంగా

విద్యుత్ సరఫరా నిలిపివేత

నాగార్జునసాగర్ : నందికొండలోని హిల్‌కాలనీలో ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లుగా విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధితుడికి ఆర్థిక సాయం

దేవరకొండ : నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన గంజి అశోక్ కూతురు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వైద్య ఖర్చులకు గాను రూ.10లక్షల మేర ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న దేవరకొండకు చెందిన ఆదరణ ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ సొసైటీ సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో రూ.12వేలు ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో పందిరి జ్యోతివెంకన్న, లకుమారపు మల్లయ్య, ఆలంపల్లి పద్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

దేవరకొండ : పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన అభివృద్ధికి సోమవారం రిటైర్డ్ ఉపాధ్యాయురాలు బాలమసమ్మ రూ.10,116లను ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, కోశాధికారిలు అంకం చంద్రమౌళి, పంగునూరు లింగయ్యలకు విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అభివృద్ధికి దాతలు,రిటైర్డు ఉద్యోగులు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వనం బుచ్చయ్య, నక్క వెంకటనారాయణ, బాలయ్య పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పాదయాత్ర

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా డాక్టర్ విశారధన్ మహారాజు 10వేల కిలో మీటర్ల పాదయాత్రను చేపడుతున్నారని దళిత శక్తి ప్రోగ్రాం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య మహారాజ్, మహిళా నాయకురాలు సుజాత అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద దళిత శక్తి ప్రోగ్రాం మండల అధ్యక్షుడు రాజశేఖర్ మహారాజ్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శంకర్, వంశీ, విజయ్, హరికృష్ణ, నాగయ్య, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

పెద్దవూర: ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 1200 మంది నిరుపేద గిరిజన విద్యార్థులకు దివంగత తహసీల్దార్ కడారు సునంద జ్ఞాపకార్థం ఆమె భర్త తిరుమలగిరి సాగర్ హెచ్‌డబ్ల్యూఓ, టీఎస్‌జీటీఎస్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి కడారు లక్ష్మారెడ్డి వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు 400 వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ధీరావత్ బాలోజీ, వార్డెన్ కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు రాంరెడ్డి, ఎండీ.షబ్బీర్, బి.కృష్ణ, సురేందర్, షాహీన్‌బేగం, సైదులు, శాంతి పాల్గొన్నారు.

తెలుగు తేజం విశిష్ట సేవా పురస్కారానికి ఎంపిక

నిడమనూరు : పుడమి సాహితి వేదిక నల్లగొండ ఆధ్వర్యంలో ప్రతియేటా వివిధ రంగాల్లో విశిష్ట కృషి చేసిన వ్యక్తులకు ఇచ్చే జాతీయ పురస్కారానికి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కుక్కడపు శ్రీనివాస్ జాతీయ తెలుగు తేజం విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ పురస్కారాన్ని ఈ నెల 8న పుడమి సాహితి వేదిక చిట్యాలలోని రాజ రాజేశ్వరి ఫంక్షన్‌హాల్‌లో అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను అభినందించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మిర్యాలగూడ : వేములపల్లి మండల కేంద్రంలో నూతన అంగన్ వాడీ భవన నిర్మాణానికి ఎంపీపీ సునీత, వైఎస్ ఎంపీపీ పాదూరి గోవర్ధనితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నిధుల నుంచి మంజూరైన రూ.10లక్షలతో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, ఎంపీటీసీ చల్లబొట్ల చైతన్య, ఎంపీడీఓ నరసింహ, నాయకులు పాల్వాయి రాంరెడ్డి, శ్రీనివాస్, రావు ఎల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, లతీఫ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత, రజిత, శోభా, రోజా పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో కబడ్డీ కోచ్‌గా శ్రీను

తిరుమలగిరి (నాగార్జునసాగర్) : మండలంలోని సఫావత్‌తండాకు చెందిన మెగావత్ శ్రీను డిసెంబర్ నెల 27, 28, 29 తేదీల్లో జార్ఖండ్‌లో నిర్వహించిన 32వ జాతీయ సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు కోచ్‌గా వ్యవహరించాడు. ఆయన కోచింగ్‌లో రాష్ట్ర జట్టు ఉత్తమ ప్రతిభను కనపర్చింది. ఆయనను తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రవికుమార్, చంద్రమౌళిలు అభినందించారు.

ఆలయాల్లో 'ముక్కోటి' వేడుకలు


మిర్యాలగూడలోని శ్రీకోదండ రామాలయంలో పూజలను నిర్వహిస్తున్న భక్తులు


దేవరకొండ : కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రెడ్డికాలనీలో గల శ్రీకొదండ రామాలయంలో ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వారా భక్తుల దర్శనం పోటెత్తింది. రామాలయంలో ఉత్తర ద్వారం ద్వారా తెల్లవారుఝామున నుంచి మహిళలు దీపారధనలతో భారీగా తరలివచ్చారు. అనంతరం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదే విధంగా పట్టణంలోని సీతారాంపురంలో గల గీతా మందిర్ శ్రీరుక్మిణి సత్యభామ సమేతా శ్రీకృష్ణ దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వారం దర్శనం ద్వారా భక్తులు నడిచారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే పట్టణంలోని శివాలయంతో పాటు బోటింగ్ పార్క్‌వద్ద గల శ్రీశ్రీశ్రీ చెన్నకేశ్వరస్వామి ఆలయానికి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం శివలింగాలకు నిర్వహించే అభిషేకాలను తిలకించారు. అదే విధంగా హౌసింగ్ బోర్డులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదే విధంగా భక్తాంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

కొండమల్లేపల్లి : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంతో పాటు పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరకొండ : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం దేవరకొండలో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవరకొండలోని శ్రీ గరుడాద్రి వేంకటేశ్వర స్వామి దేవాలయం, కోదండ రామాలయం దేవాలయాల్లో భక్తులు స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. పట్టణంలోని శ్రీ గరుడాద్రి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మిర్యాలగూడ మండలంలోని అవంతీపురంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి, సరస్వతీ దేవాలయాల్లో సోమవారం రాష్ట్ర ఆగ్రోస్ డెవలప్‌మెంట్ చైర్మన్ తిప్పన విజసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తిప్పన దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

హాలియా : ముక్కోటి ఏకాదశి సందర్భంగా అనుముల మండలంతో పాటు, హాలియా మున్సిపాలిటీ పట్టణంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో షిరిడీ సాయిమందిరం, భక్తాలయ స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, సీతా రామచంద్రస్వామి ఆలయంలో తెల్ల వారు జాము నుంచే అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నాగార్జునసాగర్ : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకోని నాగార్జునసాగర్ జలాశయతీరానగల రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారు ఉత్తర ద్వారం వద్ద దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేశారు. సోమవారం తెల్లవారు జామున్నే భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి దీపాలను వెలిగించి సహస్త్రనామపారాయణం చేశారు. ఆలయ ప్రదర్శనల అనంతరం ఉత్తర ద్వారం వద్ద స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రాతఃకాలం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక వ్రతాలు జరిగాయి. భక్తులకు దేవుడి దర్శనం కలిగేలా ఏర్పాటు చేశారు.


కొండమల్లేపల్లిలో..


నాగార్జునసాగర్‌లో..


హాలియా : శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరు

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


గొల్లపల్లిలో మిషన్ భగీరథ ట్యాంక్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందిస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గొడుకొండ్ల, ప్రశాంతపురి, గొల్లపల్లి, విరాట్‌నగర్ కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న మిషన్‌భగీరథ ట్యాంక్ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. భవిష్యత్తులో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, సర్పంచులు కొండూరు శ్రీదేవి, కేతావత్ బంగారి, గార్లవిశ్వనాథం, మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, చాంద్ పాషా, నర్సింహా, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దేవరకొండ : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. దేవరకొండ ప్రాంత క్రీడాకారులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో స్పోర్ట్స్ అసోసియేషన్ సేవలను మరింత విస్తృత పర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సీఐ శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌పీటి, సభ్యులు తాళ్ల శ్రీధర్‌గౌడ్, కృష్ణకిశోర్, దేవేందర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఎంపీపీ పేర్ల సుమతి

హాలియా : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీపీ పేర్ల సుమతి అన్నారు. అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం హాలియా పట్టణంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల్లో నిర్వహించిన భేటి బచావో.. బేటి పడావో కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆడ పిల్లలను భాగా చదివించాలని కోరారు. బాల్య వివాహాల వల్ల శారీరక, మానసిక పెరుగుదల ఉండదని పిల్లలు మానసికంగా కృంగిపోనున్నట్లు తెలిపారు. కిశోర బాలికలకు వ్యక్తి పరిశుభ్రత, పోషకాహారం, పరిశుభ్రమైన నీరు, తగినంత హిమోగ్లోబిన్ శాతం ఉన్నప్పుడే చదువులో, ఆటలో చురుకుగా రాణిస్తారన్నారు. బాలికలకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు 1098కి కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, ఎంఈఓ బాలునాయక్, ప్రిన్స్‌పాల్ హైమావతి, రమాదేవీ, సరిత, కిశోర బాలికలు పాల్గొన్నారు.

శంకుస్థాపనలకే పరిమితమా?

పెద్దవూర : గిరిజనుల కోసం హాలియా పట్టణంలో ఏర్పాటు చేస్తున్న బంజారా భవన్ శంకుస్థాపనకే పరిమితమా, ఇదేనా గిరిజనులపై బీఆర్‌ఎస్ చూపిస్తున్న ప్రేమ అని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ సక్రునాయక్ విమర్శించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సాగర్ ఉప ఎన్నికల్లో భాగంగా హాలియా పట్టణంలో బంజారా భవన్ నిర్మిస్తామని, గిరిజన బంధు ఇస్తామని వాగ్దానం చేసి గిరిజన ఓట్లను దండుకుని బీఆర్‌ఎస్ లాభం పొందిందన్నారు. కాని ఇప్పటివరకు వాటి ప్రస్తావనే లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వాలానాయక్, నరేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : ఖమ్మం జిల్లా బొనకల్ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో నిర్వహించే 67వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మిర్యాలగూడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో జి.సుశాంత్ 8వ, రాజేశ్9వ, మహిపాల్ 9వ, పి.హర్షిత్10వ తరగతులకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. రవీంద్రప్రసాద్, పీఈటీ గురువయ్యలు సోమవారం తెలిపారు. ఇటీవల నల్లగొండ పట్టణంలో రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు నిర్వహించిన జిల్లా స్థాయి జట్టులో వీరిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అనంతరం ఆ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాములు, సృజన్‌కుమార్, శంకర్‌నాయక్, జానకమ్మ, పాఠశాల పీడీ లక్ష్మణ్, హెల్త్ సూపర్‌వైజర్ భిక్షం, మధుసూధన్‌రెడ్డి, రవి, ఖర్, కోటి, నాగునాయక్, చైతన్యలతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో కూడా రాణించి జాతీయ స్థాయికి ఎంపికై ఆ పోటీల్లో కూడా మంచి ప్రతిభాను కనబరిచి మంచి గుర్తింపును తీసుకురావాలని ఆకాంక్షించారు.

గిరిజనుల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

పెద్దవూర : గిరిజనుల సంక్షేమం కేవలం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గిరిజన భవన్ మీద అవగాహన లేకుండా మాట్లాడుతున్న చిల్లర నాయకులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వాస్తవాలు తెలియకుండా కొందరు గిరిజన నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీజేపీలతో కుమ్మక్కై చిల్లరగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు శ్రీకర్‌నాయ క్, ఎం.శివాజీనాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాలు

డిండి : మండల కేంద్రంలోని హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయ ఆరవ వార్షికోత్సవాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా నిత్యపూజలతోపాటు వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం స్థానిక అయ్యప్ప ఆలయ పద్దెనిమిది మెట్లను పూలతో అలంకరించి, దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీతా జనార్ధన్‌రావు, సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న, ఉప సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ఆర్డీఓకు వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్

దేవరకొండ : ప్రభుత్వ భూమిలో ఇంటిని నిర్మించుకున్న వారికి ఇంటి స్థలం పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి ఆనంద్ కోరారు. సోమవారం ఈ మేరకు దేవరకొండ ఆర్డీఓ గోపిరాంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. దేవరకొండ మండల పరిధిలోని కట్టకొమ్ము తండా గ్రామంలో 2006లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన పోరాటాల ఫలితంగా 42మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, మరో 71మందికి ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐద్వా సంఘం జిల్లా నాయకురాలు నిమ్మల పద్మ, నరసింహ, లక్ష్మయ్య, పరశురాం, బుచ్చిరాములు ఉన్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్ లింగారెడ్డికి సన్మానం


లింగారెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దవూర : ఇండియన్ ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొంది స్వగ్రామానికి వచ్చిన లక్క లింగారెడ్డిని సోమవారం విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అక్టోబర్ నెలలో మండలంలోని బట్టుగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థిగా లింగారెడ్డి రూ.15వేల విలువైన ఎల్‌ఈడీ టీవీని బహూకరించారు. పదవీ విరమణ పొంది గ్రామానికి వచ్చిన సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు ఆహ్వానించి శాలువాలు, పూలమాలతో సత్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చామకూరి లింగారెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం హిమవంతరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ కత్తి శ్రీదేవి, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగలక్ష్మీ, కోరె చెన్నయ్య, జగన్, ఈదయ్య, పరమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అన్నారు. సోమవారం కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఏరియా ఆస్పత్రిలో పని చేసే కార్మికులతో కలసి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ సమరధ్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్మికులకు పనికి తగిన వేతన ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు రామ్మూర్తి, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్


మిర్యాలగూడ అర్బన్ : వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు


హాలియాలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కొండమల్లేపల్లి : అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : సర్పంచ్‌ల నిధులు విడుదలలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై టీపీసీసీ రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు బయలుదేరుతున్న సర్పంచ్‌లను వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ .ఆనీభాషా, యూత్ కాంగ్రెస్ నాయకులు అజహార్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : టీపీసీసీ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తల పెట్టిన భారీ ధర్నాకు హాజరుకావాలని ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరుకాకుండా ముందస్తుగానే సోమవారం తెల్లవారుజాముననే అరెస్ట్ చేసి విజయపురి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అరెస్టయిన వారిలో జంగయ్య, చిన్ని, శంకర్, ముజీబ్, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ధర్నాకు అనుమతి నిరాకరణ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులను గృహనిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ సోమవారం పట్టణ కేంద్రంలో మండల పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం చేసి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ధర్నాకు అనుమతి నిరాకరించడం దారుణమని, నాయకులు అరెస్ట్ అప్రజాస్వామికమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, ఎస్టీ సెల్, మైనార్టీ సెల్ అధ్యక్షులు పాండునాయక్, మజహార్ మొహినోద్దీన్, నాయకులు కుందూరు రాజేందర్‌రెడ్డి, రమణయ్య, కుకుడాల ఆంజనేయులు, జూపల్లి శ్రీనివాస్. మునినాయక్, నెర్మటి వెంకట్‌రెడ్డి, సాదిక్, అమరేందర్‌రెడ్డి, నక్క ఆనంద్‌బాబు, నకిరేకంటి సైదులు, మల్లారెడ్డి, బానుచందర్‌రెడ్డి, రాంరెడ్డి, చందునాయక్, అంజి, నర్సి, ముని, సర్దార్ నాయక్, గోవర్ధన్‌రెడ్డి, అజ్జు పాల్గొన్నారు.

దేవరకొండ : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా నేపథ్యంలో సోమవారం దేవరకొండ మండల పరిధిలోని పలువురు కాంగ్రెస్‌పార్టీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో కొర్ర రాంసింగ్, సీత్యానాయక్, గోపాల్‌నాయక్, జగన్‌నాయక్, కదారి అయ్యన్న, నర్యానాయక్ పాల్గొన్నారు.

పెద్దవూర : టీపీసీసీ ఆదేశానుసారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నాకు పిలుపునివ్వడంతో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సోమవారం సాయంత్రం స్వంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు నల్ల హన్మంతరెడ్డి, మేకల శ్రీకాంత్, బాసునాయక్ తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లి : రాష్ట్రంలో సర్పంచ్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు ప్రభుత్వ తీరును ఖండించారు. అరెస్టయిన వారిలో సర్పంచ్‌లు రవినాయక్, గడ్డం శ్రీరాములు, పంది రుద్రమ్మశ్రీను, రాకేశ్‌నాయక్ తదితరులున్నారు.

అడవిదేవులపల్లి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల సమస్యలపై ధర్నా చౌక్‌కు వెళ్లేందుకు సిద్ధం అయిన కాంగ్రెస్ పార్టీ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం పోలీసులు కాంగ్రెస్ నాయకులను సొంత పూచీకతుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హనుమంతు, బండి సాయి, గోడుగు హనుమయ్య, రాంమ్మూర్తి, చిరంజీవి పాల్గొన్నారు.

మిర్యాలగూడ : సర్పంచ్‌లకు సంఘీభావంగా ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నాకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ దామరచర్ల మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్‌తోపాటు మరికొందరిని సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి వాడపల్లి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బయ్య, నాయకులు మహమ్మద్ సద్దాం, బత్తుల శ్రీను, అల్లం నాగరాజు, తాళ్లపల్లి విజయ్, వసంత్, శివచరణ్, మామిడి మలయ్యయాదవ్ పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


హాలియాలో కేక్ కట్ చేస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్ : టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి 43వ జన్మదిన వేడుకలను హాలియా, పెద్దవూర, త్రిపురారం, మిర్యాలగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు అందజేశారు.

టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ అర్బన్ : టీఎస్ యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను సోమవారం ఎంపీడీఓ జి.జ్యోతిలక్ష్మి ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్‌మీడియా కన్వీనర్ బక్కా శ్రీనివాసచారి, జిల్లా కార్యదర్శి చిన్న వెంకన్న, మిర్యాలగూడ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఎస్సీలకు పంచాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న మట్టయ్య

మిర్యాలగూడ : మండలంలోని కాల్వపల్లి గ్రామ సర్వే నంబర్ 198లో గల ప్రభుత్వ భూములను పేద ఎస్సీ మాదిగలకు పంచాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య అన్నారు. సోమవారం ఈ మేరకు ఆర్డీఓ చెన్నయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోని దళితులను బెదిరింపులకు గురిచేస్తున్నారని వెంటనే భూమి లేని నిరుపేద ఎస్సీలకు ప్రభుత్వం భూమిని పంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపి, కాశీ, బచ్చలకూరి నరేష్, శ్రీను, రాంబాబు, భిక్షం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం, మంత్రి జగదీశ్‌రెడ్డికి మొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి